

వరలక్ష్మీ వ్రతంతో సకల శుభాలు

సకల శుభాలను దరి చేర్చే వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం ఆచరించేందుకు మహిళలు ఏర్పాట్లు చేసుకున్నారు. 8లో



నేడు జిల్లాకు 'తుమ్మల'

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం వస్తుండడంతో ఘనస్వాగతం పలికేందుకు ఆయన అనుచరులు సిద్ధమయ్యారు. 8లో

గరిష్టం / కనిష్టం 33° / 24°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం చిరుజల్లులు కురిసే అవకాశముంది. ఆకాశం మేఘావృతమై ఎండప్రభావం ఉండదు.

న్యూస్‌రీల్

కొత్త బస్టాండ్‌లో ఏసీ కన్వెన్షన్ సెంటర్!

ఖమ్మంమామిళ్లగూడెం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కొత్త బస్టాండ్‌కు అదనపు హంగులు చేకూరనున్నాయి. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవతో బస్టాండ్ ఆవరణలో అత్యాధునిక సదుపాయాలతో ఏసీ కన్వెన్షన్ సెంటర్, షాపింగ్ బ్లాక్ అందుబాటులోకి రానుంది. రూ.40 కోట్ల అంచనా వ్యయంతో బస్టాండ్ పక్కన వీటిని నిర్మించనున్నారు. కన్వెన్షన్ సెంటర్ 1.7 ఎకరాల విస్తీర్ణం, రెండు వేల సీట్ల సామర్థ్యంతో నిర్మించేందుకు రంగం సిద్ధమవుతోంది. మొదటి అంతస్తులో కన్వెన్షన్ హాల్ కొనసాగనుండగా, రెండో అంతస్తును కమర్షియల్ బ్లాక్‌గా వినియోగిస్తారు. ఏడెకరాలకు పైగా విస్తీర్ణంలో రూ.30 కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్త బస్టాండ్ 30 ప్లాట్‌ఫాంలతో ప్రయాణికులకు సేవలందిస్తుండగా.. కన్వెన్షన్ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి వస్తే ప్రజలకు సౌకర్యంగా ఉండడంతో పాటు ఆర్టీసీకి భారీగా ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

రేపటి నుండి జమలాపురంలో పవిత్రోత్సవాలు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26వ తేదీ నుండి వార్షిక పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా 26న యాగశాల ప్రవేశం, గణపతి పూజ, 27న సకల దేవతలకు పవిత్రాల ధారణ, 28న పవిత్రాల విసర్జన, పూర్ణాహుతి, 29న అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లకు శాకంబరీగా అలంకరణ, ప్రత్యేక పూజలు ఉంటాయని ఈఓ జగన్మోహన్‌రావు తెలిపారు.

జ్ఞానం పెంచుకుంటేనే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జావీద్‌పాషా

ఖమ్మంలీగల్: విద్యార్థులు తరగతులు మారే కొద్ది జ్ఞానం పెంపొందించుకోవాలని, తద్వారా భవిష్యత్‌లో ఉత్తమ ఫలితాలుస్తాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్ పాషా తెలిపారు. జిల్లా కేంద్రంలోని బొమ్మ కళాశాలలో కొనసాగుతున్న సంక్షేమ శాఖల గురుకులాలను గురువారం ఆయన సందర్శించారు. ఈమేరకు భోజనశాల, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం జావీద్‌పాషా భారత రాజ్యాంగం, ప్రాథమిక విధులను వివరించారు. చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో గురుకులాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'గాంధీ' సినిమా చూసిన 29,484 మంది..

ఖమ్మం సహకారనగర్: స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా జిల్లాలోని థియేటర్లలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 16 నుండి 24వ తేదీ వరకు ప్రతిరోజు ఒక షో గాంధీ సినిమాను ప్రదర్శించారు. ఈమేరకు జిల్లాలో 29,484మంది సినిమా చూశారని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించి థియేటర్లకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈమేరకు థియేటర్లు, ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలతో పాటు రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, విద్యాశాఖ అధికారులు సహకరించారని తెలిపారు.

ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన

సత్తుపల్లిరూరల్: అందరూ ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోవచ్చని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లి మండలం రేజర్లలో గురువారం ఆయన రజకులతో సమావేశమై మాట్లాడారు. యాంత్రీకరణ నేపథ్యాన రజకులకు కులవృత్తి దూరమవుతోందని తెలిపారు. ఈనేపథ్యాన ఆర్థికంగానే కాక విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో వెనుకబడిన రజకులను ఆదుకునేందుకు ప్రభుత్వం దళితబంధు మాదిరి రూ.10లక్షల ఆర్థికసాయం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సంఘం నాయకులు బలుసుపాటి దాసు, వల్లూరు శ్రీను, బలుసుపాటి కృష్ణ, చిటికెల నాంచారియ్య, పంతంగి రాంబాబు, మల్లెలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి.. 100

పక్కా ప్రణాళికతో ముందుకు

- అభ్యర్థుల ప్రకటనతో ప్రచారంలోకి బీఆర్‌ఎస్
- ప్రచార రథాలు, జెండాలు సిద్ధం
- కులాలు, సంఘాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు
- అసంతృప్తి లేకుండా.. విజయమే లక్ష్యంగా పయనం



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన చెరుకూరి కృష్ణమూర్తి, మేయర్ నీరజ తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారానికి వంద రోజులు టార్గెట్‌గా నిర్దేశించుకుంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యాన పార్టీ కేడర్ జోష్‌లో ఉంది. బరిలో నిలిచే అభ్యర్థులు ప్రచార రథాలు, జెండాలు, ఫ్లెక్సీలు, ఇతర ఎన్నికల సామగ్రికి ఆర్డర్లు ఇచ్చారు. ఇదే సమయాన అసంతృప్త నేతలను బుజ్జగిస్తూ ప్రచారరంగంలోకి దిగారు. నియోజకవర్గాల వారీగా అభ్యర్థులు విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతిపక్షాలు అభ్యర్థులను ప్రకటించే నాటికి రెండు, మూడు దఫాలు నియోజకవర్గాన్ని అంతా చుట్టేలా కార్యాచరణ రూపొందించుకున్నారు.

ముఖ్యనేతలకు దిశానిర్దేశం

నియోజకవర్గాల్లో అభ్యర్థులు ముఖ్య నేతలతో సమావేశమవుతూ దిశానిర్దేశం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలతో జరిగిన లబ్ధిని గడపగడపకూ తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. ఖమ్మంలో ఇప్పటికే ముఖ్యనేతలతో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమావేశమయ్యారు. ఖమ్మం నగరంలోని 60 డివిజన్లతో పాటు రఘునాథపాలెం మండలంలో చేసిన అభివృద్ధి పనులతో ప్రత్యేకంగా కరపత్రాలు రూపొందిస్తున్నారు. వీటిని తమ కేడర్‌తో ఇంటింటికీ చేర్చేలా ప్రణాళిక రూపొందించారు. మరోపక్క పాలేరు, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో కూడా ఈ దిశగా కార్యాచరణ కొనసాగుతోంది.

పార్టీ అండగా ఉంటుందంటూ..

జిల్లాలోని పాలేరు, వైరా, మధిర వంటి నియోజకవర్గాల్లో కొందరి నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. వీరు బహిరంగంగానే పార్టీ అభ్యర్థులను వ్యతిరేకిస్తున్నారు. బీఆర్‌ఎస్‌లో టికెట్ ఆశించిన ఆశావహులను బుజ్జగించే బాధ్యతను పార్టీ అధిష్టానం పలువురు నేతలకు అప్పగించింది. పాలేరులో కందాల ఉపేందర్‌రెడ్డికి టికెట్ ఖరారు కావడంతో జిల్లావ్యాప్తంగా మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులు భేటీ అవుతున్నారు. దీంతో హైదరాబాద్‌లో ఉన్న తుమ్మలను నేతలు బుజ్జగిస్తున్నారు. ఇక మధిరలో బొమ్మెర రామ్మూర్తి తన అసంతృప్తి బహిరంగంగానే వ్యక్తం చేస్తూ ఉద్యమకారులకు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైరాలో రాములునాయక్‌కు టికెట్ రాకపోవడంతో అసంతృప్తితో ఉన్నా గుంభనంగా వ్యవహరిస్తున్నారు. కొందరి కారణంగానే తనకు టికెట్ రాలేదని వ్యాఖ్యానించారు. వీరిని బుజ్జగించేందుకు అధిష్టానం ప్రయత్నిస్తోంది. పార్టీ మళ్లీ గెలిస్తే మరెన్నో పదవులు అందుబాటులో ఉంటాయని, ఎమ్మెల్యే టికెట్ ఒకటే లక్ష్యం కాదని నచ్చచెప్పడంలో నిమగ్నమయ్యారు.

సమయాన్ని వినియోగించుకునేలా..

అన్ని పార్టీల కన్నా ముందుగానే బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించడంతో ఎన్నికల వరకు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా సిద్ధమవుతున్నారు. అభ్యర్థులు.. తమ కార్యకర్తలు, అభిమానులు, నేతలతో సమావేశమవుతూ ప్రచార వ్యూహాలను ఖరారు చేస్తున్నారు. దాదాపు వంద రోజుల వరకు సమయం ఉన్నందున ప్రత్యర్థి పార్టీలు అభ్యర్థులను ప్రకటించేలోగానే ఒకటికి, రెండుసార్లు ప్రజలను కలవాలని సూచిస్తున్నారు. మరోవైపు టికెట్ రాకుండా అసంతృప్తితో ఉన్న వారిని బుజ్జగించి.. వారినీ తమతో కలుపుకునేలా చర్యలు చేపడుతున్నారు.

దూకుడుగా కార్యక్రమాలు..

జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, కొత్త పనులకు శంకుస్థాపన, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పంపిణీ చేయడంపై బీఆర్‌ఎస్ నేతలు దృష్టి సారించారు. ప్రధానంగా దివ్యాంగులకు పెంచిన ఆసరా పింఛన్ల పంపిణీ, బీసీ బంధు చెక్కులు పంపిణీ చేస్తూ బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలని కోరుతున్నారు. జిల్లాతో పాటు ఖమ్మం నియోజకవర్గంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విస్తృతంగా పర్యటిస్తుండగా.. పాలేరులో కందాల ఉపేందర్‌రెడ్డి, సత్తుపల్లిలో సండ్ర వెంకటవీరయ్య, మధిరలో లింగాల కమల్‌రాజు లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పంపిణీ చేపడుతున్నారు. అలాగే, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలతో తీరిక లేకుండా గడుపుతున్నారు. అలాగే, గ్రామాలు, మండల కేంద్రాలు, మున్సిపల్ డివిజన్ల వారీగా గతంలో తమకు ఎక్కడ తక్కువ ఓట్లు వచ్చాయో లెక్కలు వేస్తూ ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగుతున్నారు.

వర్తక వ్యాపారులకు అండగా ఉన్నాం...

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని వర్తక వ్యాపారులకు అండగా ఉండడమే కాక ఏనాడు భారం కాలేదని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలో గురువారం జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడారు. త్రీటౌన్ అభివృద్ధి జరగాలంటే ముందు గోళ్లపాడు చానెల్‌ను ప్రక్షాళన చేయాలని నిర్ణయించి చేపట్టిన పనులతో ఇప్పుడు లక్షలాది మందికి ఆహ్లాదం పంచుతున్నట్లు తెలిపారు. నగరంలో ఇంకా పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత ఉన్నందున మళ్లీ తనను గెలిపించాలని కోరారు. భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, ఆర్యవైశ్య మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులిపాటి ప్రసాద్ మాట్లాడుతూ మంత్రి పువ్వాడ గెలుపే తమ గెలుపు అని.. ఆయన అభ్యర్థిత్వాన్ని ఆర్యవైశ్య సమాజం స్వాగతిస్తోందని తెలిపారు. మేయర్ పి.నీరజతో పాటు వేములపల్లి వెంకటేశ్వరరావు, చిన్ని కృష్ణారావు, కొప్పు నరేష్‌కుమార్, గుర్రం ఉమామహేశ్వరరావు, దేవత అనిల్, గోళ్ల రాధాకృష్ణ, జి.శ్రీనివాస్, కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, కొత్త వెంకటేశ్వరరావు, పసుమర్తి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో లక్ష్యాల సాధన

ప్రభుత్వ పథకాలపై సమీక్షలో కలెక్టర్ గౌతమ్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అధికారులు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత సమయంలో సాధించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన ఎంపీడీఓలతో హరితహారం, గృహలక్ష్మి, బీసీ, మైనార్టీలకు ఆర్థిక సాయం, రెండో విడత దళితబంధు తదితర పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 26వ తేదీన సామూహిక హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన త్వరగా ముగించాలని, బీసీ, మైనార్టీ లబ్ధిదారుల ఎంపిక, గొర్రెలు, దళితబంధు యూనిట్లపై దృష్టి సారించాలని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

ఈవీఎంల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ గౌతమ్ పోలీసు ఉద్యోగులను ఆదేశించారు. జెడ్పీ ఆవరణలోని ఈవీఎం గోదాంను గురువారం ఆయన తనిఖీ చేశాక రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఓటరు ముసాయిదా జాబితాలో పొరపాట్లు ఉంట్లే తెలియజేయాలని, అర్హులందరూ పేరు నమోదు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, ఓటరు నమోదు యాప్ పనితీరు, లాభాలను కలెక్టర్ వివరించారు.

వేగంగా అభివృద్ధి పనులు

జిల్లాలోని మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కకలెక్టర్ మాట్లాడుతూ మంజూరైన అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, డీపీఆర్సీ భవనంలో జరిగిన సమావేశంలో దశాబ్ది సంపదవనాలు, ఆసరా పెన్షన్లు, గృహలక్ష్మి, కారుణ్య నియామకాలు, భూసేకరణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి సూచనలు చేశారు.

పెన్షన్ మంజూరుకు అవకాశం

జిల్లాలో వృద్ధాప్య పెన్షన్ పొందుతున్న వారు మరణిస్తే వారి స్థానంలో భార్యకు పెన్షన్ మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ విషయంలో అర్హులు ఉంటే మండల పరిషత్, మున్సిపల్, డీఆర్‌డీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, పశుసంవర్థక శాఖ జేడీ వేణుమనోహర్, సీపీఓ శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి జ్యోతి, జిలడీడబ్ల్యూఓ సుమ, మున్సిపల్ కమిషనర్లు సుజాత, రమాదేవి, వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు జి.గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్‌డీసీ రాజేశ్వరి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులుతో పాటు వివిధ శాఖల ఉద్యోగులు మదన్‌గోపాల్, రాంబాబు, రంజిత్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు




యూరియా గోదాన్‌ను పరిశీలిస్తున్న డీఏఓ సరిత

వైరా: జిల్లా రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి బి.సరిత తెలిపారు. వైరాలోని యూరియా గోదాంను గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. సకాలంలో అన్ని సొసైటీలు, రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా చేశామని డీఏఓ తెలిపారు. అన్ని సొసైటీలకు కలిపి 2,919 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయగా, వైరా ప్రాజెక్ట్ పరిధిలో ఒకేసారి వరి నాట్లు పూర్తి వేయడంతో వాడకం పెరిగిందని చెప్పారు. అనంతరం వైరా మండలంలోని సోమవరం, తాటిపూడి గ్రామాల్లో వరి పొలాలను ఏడీఏ వి.బాబురావుతో కలిసి పరిశీలించారు. వరి సాగు చేస్తున్న రైతులు మొదటి దఫాగా డీఏపీ, యూరియా వేయాలని, కలుపు నివారణకు మందులు పిచికారీ చేయాలని డీఏఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ పవన్‌కుమార్, రైతులు ఉన్నారు.

అమిత్‌షా పర్యటన ఖరారు

27న రామయ్య దర్శనం, ఖమ్మంలో సభ

ఖమ్మంమామిళ్లగూడెం: కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఖమ్మం పర్యటన ఖరారైంది. గతంలో రెండు సార్లు ఆయన వస్తారని ప్రకటించినా చివరి నిమిషంలో రద్దయింది. ఈసారి తాజాగా 27వ తేదీన రానున్నారని నాయకులు ప్రకటించిన నేపథ్యాన గురువారం టూర్ షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 27న ఉదయం 11 గంటలకు ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరనున్న అమిత్ షా మధ్యాహ్నం 1.25 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఎయిర్‌పోర్ట్‌కు చేరకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2.10 గంటలకు భద్రాచలం వస్తారు. భద్రాచలంలో శ్రీసీతారామ చంద్రస్వామిని దర్శించుకుని హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. ఇక్కడ 3.40 గంటలకు ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో బీజేపీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం షా సాయంత్రం 5.45 గంటలకు మళ్లీ హెలికాప్టర్‌లో విజయవాడ బయలుదేరతారు. కాగా, షా పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ శుక్రవారం జిల్లాకు వస్తున్నారు. ఈసందర్భంగా ఆయన ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానాన్ని పరిశీలించడంతో పాటు నాయకులతో సమావేశమై జనసమీకరణపై దిశానిర్దేశం చేస్తారు.



పోలీసుల సేవలు భేష్

- వారి కృషితోనే ప్రశాంతంగా జిల్లా
- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



కమిషనరేట్ ముందు జాతీయ జెండాతో కూడిన హైమాస్ట్ పోల్

ఖమ్మం క్రైం: జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కొనియాడారు. పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటుచేసిన 50 అడుగుల జాతీయ జెండాతో కూడిన హైమాస్ట్ ఫ్లాగ్ పోల్‌తో పాటు కమిషనరేట్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అనంతరం ఇటీవల మున్నేటి వరదల సమయాన బాధితులను రక్షించిన 30 మంది పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ సుదూరం నుండి చూడగలిగే జాతీయ జెండా ప్రతీ పౌరుడిని గర్వపడేలా చేస్తుందన్నారు. ఒకనాడు ఇది కమాండ్ కంట్రోల్ భవనంగా ఉండేదని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయాన అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ఆరు పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటుచేసే బిల్లు పెడుతుండగా ఖమ్మం పేరు కూడా చేర్చాలని కోరడంతో సీఎం సానుకూలంగా స్పందించారని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ఎక్కడ ఇబ్బంది లేకుండా ప్రజలకు భద్రత, భరోసా కల్పిస్తున్న ఉద్యోగులు అభినందనీయులన్నారు. కోవిడ్ సమయాన పోలీసుల సేవలను ప్రజలు ఎప్పుడూ మరిచిపోలేరని తెలిపారు.



ఫ్లాగ్ పోల్‌ను ప్రారంభించిన మంత్రి పువ్వాడ, పక్కన కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

కాగా, 22 ఏళ్లుగా ఎదురుచూస్తున్న పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందజేసిన మంత్రి పువ్వాడకు పోలీస్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, అదనపు డీసీపీలు బోస్, కుమారస్వామి, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్ కుమార్, ఏసీపీలు పీ.వీ.గణేష్, బస్వారెడ్డి, రెహమాన్, రామానుజం, ప్రసన్నకుమార్, సారంగపాణి, రవి, శివరామయ్య, సాంబరాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థీకృత నేరాల కట్టడికి దీర్ఘకాలిక ప్రణాళిక

ఖమ్మంక్రైం: వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నియంత్రణకు దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు వస్తాయని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జరిగిన నెలవారీ నేరసమీక్ష సమావేశంలో సీపీ మాట్లాడారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధిగా విజబుల్ పోలీసింగ్ అమలు చేయాలని.. తద్వారా నేరాలు నియంత్రణలో ఉంటాయన్నారు. నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాలుగా చేసుకుని మద్యం సేవించడం, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని, కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రోత్సహించాలని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించి ప్రతీ ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలని సీపీ స్పష్టం చేశారు. అలాగే, జిల్లా వ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర, గ్రామీణ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకు కారణాలను విశ్లేషించి ఖమ్మం రూరల్, కొణిజర్ల, వైరా ప్రాంతాల్లో సూచిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటుచేయాలని సూచించారు. కాగా, అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన శాంతిభద్రతలను పరిరక్షిస్తూనే ఎన్నికలు సజావుగా పూర్తయ్యేలా విధినిర్వహణకు పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీలు సుభాష్‌చంద్రబోస్, కుమారస్వామి, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్ కుమార్, ఏసీపీలు గణేష్, బస్వారెడ్డి, రెహమాన్, రామనుజం, ప్రసన్నకుమార్, రవి, శివరామయ్య, సాంబరాజు, నర్సయ్య, ఏఓ అక్తరున్నీసా బేగం పాల్గొన్నారు.

వచ్చేస్తున్నారు...!

మెడికల్ కాలేజీలో పెరుగుతున్న అడ్మిషన్లు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వం మెడికల్ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇప్పటివరకు మొత్తం 24 మంది అడ్మిషన్లు పొందారు. నేషనల్ కోటాలో ఎనిమిది మంది చేరగా, రాష్ట్ర కోటాలో గురువారం ఒకేరోజు 16 మంది ప్రవేశాలు పొందారు. వీరిలో ఎక్కువగా ఖమ్మం జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల విద్యార్థులు ఉన్నారు. దీంతో కళాశాలకు కేటాయించిన వంద సీట్లు మరో రెండు, మూడు రోజుల్లో భర్తీ అయ్యే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఖమ్మం వచ్చివెళ్లేందుకు బస్సు, రైలు సౌకర్యం ఉండడం, నూతన కళాశాల కావడంతో బోధన బాగుంటుందనే భావనతో విద్యార్థులు ఈ కళాశాలపై ఆసక్తి చూపుతున్నారు.

సూపరింటెండెంట్‌గా కిరణ్‌కుమార్?

ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిరణ్‌కుమార్‌ను నియమించే అవకాశముంది. దాదాపు ఆయన నియామకం ఖాయమైనట్లు సమాచారం. సివిల్ సర్జన్‌గా సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న ఆయనను ఖమ్మం కళాశాలకు బదిలీ చేయగా, సూపరింటెండెంట్‌గా ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు సిఫారసు చేశారు. దీంతో డీఎంఈ రమేష్‌రెడ్డి ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు సొంత శాఖ వైద్య విధాన పరిషత్‌కు వెళ్లి జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి పోస్టులో కొనసాగుతారు.



విద్యార్థినికి అడ్మిషన్ కాపీ ఇస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

కుటుంబానికి అండగా ఉంటా..

వైఎస్సార్ టీపీ నాయకుడి మృతిపై షర్మిల సంతాపం

కొణిజర్ల/ఖమ్మం అర్బన్/ఖమ్మం రూరల్: వైఎస్సార్ టీపీ నాయకుడు పఠాన్ అమన్‌ఖాన్ కుటుంబానికి అండగా ఉంటానని ఆ పార్టీ అధినేత వైఎస్.షర్మిలారెడ్డి అభయమిచ్చారు. కొణిజర్ల మండలం మేకాలకుంటకు చెందిన అమన్ బుధవారం రాత్రి మృతి చెందగా, గురువారం షర్మిల నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన తల్లిదండ్రులు రోదిస్తున్న తీరును చూసి షర్మిల సైతం కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన కుటుంబానికి తక్షణ సాయంగా రూ.3 లక్షలు అందజేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆతర్వాత కాంగ్రెస్ నాయకుడు మానుకొండ రాధాకిషోర్ కుమారుడు శ్రీధర్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని కూడా షర్మిల పరామర్శించారు. ఇంకా వైఎస్సార్ అభిమాని తోటచిన వెంకటరెడ్డి తదితరుల ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. వైఎస్సార్ టీపీ నాయకులు పిట్టా రాంరెడ్డి, రాంనాయక్, కృష్ణమోహన్, నంద్యాల రవీందర్‌రెడ్డి, జిల్లేపల్లి సైదులు, సుజాత, వెంకయ్య యాలాద్రి, సైదులు, కృష్ణ, ఆంజనేయులు, శ్రీనివాస్, రవి, ఆరిఫ్, ఉపేందర్ పాల్గొన్నారు.



అమన్ కుటుంబీకులను ఓదారుస్తున్న షర్మిల

క్లుప్తంగా

రాష్ట్ర ట్యాక్స్ కార్యవర్గంలో జిల్లాకు స్థానం




దుర్గాప్రసాద్ రమేష్‌బాబు

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ రాష్ట్ర ట్యాక్స్ ప్రాక్టీషనర్ల అసోసియేషన్‌లో జిల్లాకు ప్రాతినిధ్యం దక్కింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఖమ్మంకు చెందిన బూరుగుల దుర్గాప్రసాద్ రావు, కార్యనిర్వాహక కమిటీ సభ్యుడిగా అనసూరి రమేష్‌బాబు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని బుధవారం నూతన కమిటీని ఎన్నుకోగా వీరు నియామకం కావడంతో సంఘం బాధ్యులు ఉల్లిబోయిన సైదులు, కె.రామకృష్ణ తదితరులు అభినందించారు.

యువజన విభాగం అధ్యక్షుడిగా రమణకుమార్



రమణకు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పోతగాని రమణకుమార్ నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆయనకు సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య నియామకపత్రం అందజేశారు. ఈమేరకు ఆయనను పలువురు అభినందించారు.

అక్టోబర్ 6 నుంచి న్యాయవాదుల క్రికెట్ పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి, న్యాయవాదులు

ఖమ్మం లీగల్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అక్టోబర్ 6నుంచి 8వ తేదీ వరకు అంతర్ జిల్లాల స్థాయి న్యాయవాదుల క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. న్యాయవాది తాళ్లూరి దిలీప్ నేతృత్వాన తాళ్లూరి సాహస్ చౌదరి(బంటి) మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ పోటీల పోస్టర్లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్ కుమార్ గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దిరిశాల కృష్ణారావు, మన్నెపల్లి బసవయ్యతో పాటు రావుల వెంకట్ పాల్గొన్నారు.

చెరుకు పంటకు మందు.. ఎండిన పత్తి చేను

తిరుమలాయపాలెం: చెరుకు పంటలో కలుపు నివారణ కోసం ఉపయోగించిన మందు ప్రభావంతో పక్కనే పత్తి చేను ఎండిపోయిన ఘటన మండలంలోని కేశ్వాపురం పరిధిలో చోటుచేసుకుంది. కేశ్వాపురానికి చెందిన బాల శ్రీనివాసరావు, దొడ్డ రమేష్ పది ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేయగా పూత దశకు వచ్చింది. ఆ పక్కనే చెరుకు తోట ఉన్న రైతు వారం రోజుల క్రితం కలుపు మందు పిచికారీ చేశాడు. అయితే, గాలి ప్రభావంతో పత్తి మొక్కలపై కూడా మందు రోజుకు కొన్నిమొక్కలు ఎండిపోతుండగా, రూ.లక్షల పెట్టుబడి వృథా అయినట్లేనని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. వీరి ఫిర్యాదు మేరకు గురువారం ఏఓ ఎస్.సీతారాంరెడ్డి పరిశీలించి కలుపు మందు ప్రభావంతోనే పత్తి పంట ఎండిపోయినట్లుగా గుర్తించారు. కాగా, రైతులకు పరిహారం చెల్లించాలని పలువురు డిమాండ్ చేశారు.

రూ.కోటి అప్పులు చేసిన మహిళ పరార్

ఖమ్మంక్రైం: సౌదీలో తన భర్త పెద్ద ఉద్యోగం చేస్తున్నాడని నమ్మబలికిన ఓ మహిళ సుమారు రూ.కోటి మేర వసూలు చేసిన కానరాకుండా పోయింది. ఖమ్మం వన్‌టౌన్ పరిధిలో ఈ విషయం గురువారం వెలుగుచూసింది. శుక్రవారి పేటలో ఇద్దరు పిల్లలతో ఓ మహిళ అద్దె ఇంట్లో ఉంటోంది. ఆమె తన భర్త దుబాయ్‌లో పెద్ద ఉద్యోగం చేస్తున్నాడని స్థానికులకు చెబుతూ ఆడంబరంగా జీవించేది. పలువురి వద్ద ఎంత వడ్డీ అయినా పర్వాలేదని రూ.కోటి వరకు అప్పులు చేసింది. ఆతర్వాత వడ్డీ ఇవ్వకుండా దాటేస్తుండడంతో స్థానికులు నిలదీస్తుండగా, ఎవరికి చెప్పకుండా రాత్రికి రాత్రే ఉడాయించింది. దీంతో బాధితులు లబోదిబోమంటూ ఆందోళనకు దిగారు. అయితే, ఘటనపై ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ సీఐ స్వామి తెలిపారు. స్థానికులు బాధితులు పలువురు మాత్రం ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవటం లేదని చెబుతున్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మిర్చి	19,600	13,000
ఏసీ మిర్చి	24,300	18,000
పత్తి	7,575	6,300

– ఖమ్మం వ్యవసాయం

వరలక్ష్మీ వ్రతంతో సకల శుభాలు

- అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం
- నేడు వేడుకకు సిద్ధమైన మహిళామణులు
- పూజా సామగ్రికి పెరిగిన ధరలు

ఖమ్మంగాంధీచౌక్ /సత్తుపల్లి టౌన్ : శ్రావణ మాసం వ్రతాలు, పూజలు, పండుగలకు ప్రత్యేకం. ఈ మాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం రోజు మహిళలు వరలక్ష్మీవ్రతాన్ని ప్రత్యేకంగా జరుపుతారు. ఈ రోజున వీలుకాకపోతే శ్రావణ మాసంలోని ఏ శుక్రవారమైనా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించవచ్చని పండితులు చెబుతున్నారు. దీర్ఘకాలం సుమంగళిగా ఉండాలని వివాహితలు, మంచి భర్త లభించాలని యువతులు వ్రతం ఆచరిస్తారు. అష్టైశ్వర్యాలైన సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి కూడా లభిస్తాయని భక్తులు విశ్వసిస్తారు. నేడు శుక్రవారం కావడంతో మహిళలు వ్రతానికి సన్నద్ధమవుతున్నారు. ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు. కొందరు రంగులు వేసుకుంటున్నారు.

పూలు, పండ్లకు గిరాకీ..

వ్రతానికి అవసరమైన పసుపు, కుంకుమ, గంధం, పూలు, మామిడాకులు, అరటిపండ్లు, అమ్మవారి ఫొటో, కలశం, కొబ్బరి కాయలు, తమలపాకులు, వక్కలు తెల్ల టవలు, బ్లౌస్ పీసులు, తెల్ల దారం, పంచామృతం, ఇతర పూజా వస్తువులు సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో పూలకు, పండ్లకు, కొబ్బరి కాయలకు గిరాకీ పెరిగింది. కిలో పూలు రూ. 400 వరకు పలుకుతుండగా, సాధారణ దండలైతే మూర రూ. 30, పెద్ద దండలైతే ధర రూ.300కు పైగా పలుకుతోంది. హైదరాబాద్, బెంగళూరుల నుంచి పూలు తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. కొబ్బరి కాయ ధర రూ. 20 నుంచి రూ. 30కు పెరిగింది. రూ. 50 డజనుగా ఉన్న అరటి పండ్ల ధర రూ. 70కు చేరింది. ఇళ్లకు వచ్చి వ్రతాలను చేసే పూజారులకు కూడా డిమాండ్ పెరిగింది.




ఖమ్మంలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు, (ఇన్‌సెట్) అరటి మొక్కలు కొనుగోలు చేస్తూ..

ఇళ్లు, ఆలయాల్లో..

ఇళ్లతోపాటు ఆలయాల్లోనూ వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయాల్లో నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఖమ్మం నగరంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం, శ్రీ గుంటు మల్లేశ్వరస్వామి దేవస్థానంతోపాటు అమ్మవారి ఆలయాలను ముస్తాబు చేశారు.

సకల శుభాలు..



వరలక్ష్మీ వ్రతంతో లక్ష్మీదేవి కృపా కటాక్షాలు కలిగి ఐశ్వర్యం సిద్ధిస్తుందని మహిళలు నమ్ముతారు. ఈ వ్రతం ద్వారా సకల శుభాలు కలుగుతాయి. మహిళలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండాలని ఈ వ్రతం ఆచరిస్తుంటారు. – అవధానుల రామ్మోహన శర్మ, పురోహితులు, బ్రాహ్మణ బజార్, ఖమ్మం

వరాలు ప్రసాదించే కల్పవల్లి



భక్తితో వేడుకుంటే కోరిన వరాలను ప్రసాదించు కల్పవల్లి వరలక్ష్మీదేవి అని నమ్మకం. ఆ వరలక్ష్మీ దేవి పేరున ఉన్న వ్రతాన్ని ఆచరించడానికి ఎటువంటి నిష్టలు, నియమాలు, మడులు అవసరం లేదు. – ఆమంచి సంతోష లక్ష్మి, మోతీనగర్, ఖమ్మం

ఏటా జరుపుతాం



ప్రతి ఏటా క్రమం తప్పకుండా వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుతాం. శ్రావణ మాసం మొత్తం మంగళకరమైనది. వ్రతాలు, పూజలు చేస్తూనే ఉంటాం. వరలక్ష్మీ వ్రతం చేసుకుంటే మనసు తృప్తిగా ఉంటుంది. – వజ్రాల కార్తీక, ముస్తాఫానగర్, ఖమ్మం

పూజకు అంతా సిద్ధం..



వరలక్ష్మీ వ్రతాన్ని ఏటా జరుపుకుంటాం. తద్వారా అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని నమ్మకం. అమ్మవారికి ఇష్టమైన గారెలు, బూరెలు, పులిహోర, దద్దోజనం నైవేద్యంగా సమర్పిస్తాం. ఇందుకోసం అంతా సిద్ధం చేశాం. – డి.అనురాధ, సత్తుపల్లి

చిన్నారి జీవితంలో వెలుగులు!

గ్రహణమొర్రి బాధిత బాలికను దత్తత తీసుకున్న విదేశీ జంట

ఖమ్మం సహకారనగర్: ఆమెది కేరళ, ఆయనది ఆస్ట్రేలియా.. ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడిన వారు వివాహం చేసుకున్నారు. అయితే, ఏళ్లు గడిచినా సంతానం లేకపోవడంతో భారతదేశం నుండి అనాథ బాలికను దత్తత తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు కేంద్ర శిశు, మహిళా సంక్షేమ శాఖకు చెందిన www.cara.nic.in వెబ్‌సైట్‌లో ఫ్లోరిన్ హాకీ, గీనా కురియాకోసా దరఖాస్తు చేసుకున్నారు. సీనియారిటీ ఆధారంగా వారికి బాలికకు దత్తత ఇచ్చేందుకు నిర్ణయించిన అధికారులు ఖమ్మంలోని పిల్లల ఫొటోలు అందజేశారు. ఇందులో గ్రహణమొర్రి ఉన్న బాలికను ఎంచుకోగా, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వారితో వీడియో కాల్ ద్వారా మాట్లాడి బాలిక సంరక్షణ, చికిత్స వివరాలు తెలుసుకున్నారు. అన్నింటికీ వారు సుముఖంగా ఉండడంతో గురువారం ఖమ్మం రాగా కలెక్టర్ గౌతమ్ వారికి బాలికను అప్పగించారు. బాలికకు గ్రహణమొర్రి ఉన్నా దత్తత తీసుకోవడంపై విదేశీ దంపతులను అభినందించారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సుమతో పాటు అధికారులు విష్ణువందన, సోనీ పాల్గొన్నారు.



విదేశీ దంపతులను అభినందిస్తున్న కలెక్టర్ గౌతమ్

నేడు జిల్లాకు 'తుమ్మల'

ఘనస్వాగతం పలకాలని అనుచరుల నిర్ణయం

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి/కూసుమంచి: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం జిల్లాకు రానున్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ టికెట్లు ప్రకటించిన నేపథ్యాన ఆయన అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో తుమ్మల ఎలాగైనా పోటీ చేయాలని అనుచరులు పట్టుబడుతున్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన జిల్లా వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలకాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఖమ్మంలోని పాత క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన అభిమానులు సమావేశం కాగా, తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ తుమ్మల ఏ నిర్ణయం తీసుకున్నా అభిమానులు వెంట నడిచేందుకు సిద్ధమైనందున భారీ ప్రదర్శనకు తరలిరావాలన్నారు. శుక్రవారం ఉదయం నాయకన్‌గూడెం వద్ద ఘనస్వాగతం పలకనుండగా, ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేట మీదుగా నగరంలోకి ర్యాలీ ప్రవేశిస్తుందని తెలిపారు. అలాగే, నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లో జరిగిన సమావేశాల్లో నాయకులు సాధు రమేష్‌రెడ్డి, గూడవల్లి రాంబ్రహ్మం, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, తన్నీరు రవి, మైశా శంకర్, వేగినాటి లక్ష్మీనర్సయ్య, కడియాల శ్రీనివాసరావు, కొమ్మూరి నరేష్, ముత్తినేని వీరయ్య, కడియాల నరేష్, జూకూరి గోపాలరావు, రామసహాయం వెంకటరెడ్డి, జొన్నలగడ్డ రవికుమార్, బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి, మాదాసు ఉపేందర్, గుండా దామోదర్‌రెడ్డి, రేల వెంకటరెడ్డి, లోడిగ వెంకన్న యాదవ్, సేట్రాం నాయక్, ఇంటూరి పుల్లయ్య, బారి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల యుగంధర్

అండర్ పాస్ ఎత్తు పెంచాల్సిందే...

హైవే బ్రిడ్జి పనులను అడ్డుకున్న రైతులు

సత్తుపల్లిరూరల్: ఖమ్మం–దేవరపల్లి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల్లో రైతులకు రైతులకు నష్టం జరగకుండా చూడాలని పలువురు డిమాండ్ చేశారు. అండ్‌పాస్‌లను తక్కువ ఎత్తుతో నిర్మిస్తుండడంతో పంట పొలాలకు వెళ్లడం ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. ఈమేరకు సత్తుపల్లి మండలం సదాశివునిపాలెం రైతులు గురువారం బ్రిడ్జి పనులను అడ్డుకున్నారు. జాతీయ రహదారులపై అండ్‌పాస్‌ల ఎత్తు 12 నుంచి 16 అడుగులు ఉండాల్సి ఉండగా.. ఇక్కడ 7 అడుగుల నుంచి 8 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్నారని ఆరోపించారు. తద్వారా రైతులు పంట పొలాలకు ఎరువులతో వెళ్లాలన్నా, ఉత్పత్తులను తీసుకురావాలన్నా సుమారు 29 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వస్తుందని వాపోయారు. హైవే భూసేకరణ సమయంలో ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పారని ఆరోపించారు. ఇకనైనా సదాశివునిపాలెం, తుంబూరు గ్రామాల మధ్య అండ్‌పాస్ బ్రిడ్జి ఎత్తు పెంచాలని రైతులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో తుంబూరు దామోదర్‌రెడ్డి, కాల్నినేని వెంకటేశ్వరరావు, టి.ప్రతాప్‌రెడ్డి, ఆళ్ల నరేష్, మోరంపూడి జగదీష్, టి.ఉమామహేశ్వరరెడ్డి, చిలుకూరి శ్రీనివాసరెడ్డి, ఆళ్ల సతీష్, ఎం.వెంకటేశ్వరరావు, కాలసాని నారాయణ, రైతులు పాల్గొన్నారు.



పనులను అడ్డుకుని ధర్నా చేస్తున్న రైతులు

కేంద్రం నిధులతో సంక్షేమ పథకాలు

సత్తుపల్లిరూరల్/పెనుబల్లి: కేంద్రం ఇస్తున్న నిధులతోనే అమలుచేసే సంక్షేమ పథకాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం తన పథకాలుగా చెప్పుకుంటోందని అసోం ఎమ్మెల్యే రామకృష్ణ ఘోష్ ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రవాసీ యోజనలో భాగంగా గురువారం సత్తుపల్లి మండలం రామానగరం, పెనుబల్లి మండలం వీఎం.బంజర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాల్లో రామకృష్ణ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నందున.. తెలంగాణలోనూ బీజేపీని గెలిపించాలని కోరారు. ఈమేరకు నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి కేంద్రప్రభుత్వ పథకాలను వివరించాలని సూచించారు. ఈసమావేశాల్లో నాయకులు నంబూరి రామలింగేశ్వరరావుతో పాటు పాలకొల్లు శ్రీనివాస్, బొర్రా నరసింహారావు, వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, నర్సింహారావు, మోదుగు చిన్నకృష్ణ, చీకటి వసంతరావు, షేక్ రహమతుల్లా, వందనపు భాస్కర్‌రావు, బండి ఆంజనేయులు, షేక్ సుబానీ, నాయుడు రాఘవరావు, సుదర్శన్ మిశ్రా, ఓరుగంటి రాము, రమేష్, సుంకర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

కూసుమంచి: కూసుమంచిలోని పురాతన శివాలయాన్ని ఒడిశా రాష్ట్రం బ్రహ్మగిరి ఎమ్మెల్యే లలితేంద్ర బిద్యాదర్ మహాపాత్రో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన ఆయన ఆలయ విశిష్టతను అర్చకులు శేషగిరిశర్మ ద్వారా అడిగి తెలుసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బజ్జూరి మల్లారెడ్డి, నాయకులు దాసరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన దీక్షలు

ఖమ్మంఅర్బన్: సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో మిషన్ భగీరథ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. అయితే, అధికారులు, కంపెనీ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఖమ్మంలో భిక్షాటన చేసిన నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, కార్మికుల జిల్లా అధ్యక్ష, అన్నం వెంకయ్య, పాపగంటి రాంబాబుతో పాటు వేల్పుల అనంతరాములు, గోర్ల నరసింహారావు, పల్ల మధుసూదన్ రెడ్డి, అనుబోతు బాలకృష్ణ, జక్కుల యాదగిరి, అబ్బూరి రవి, వంశీ, ఉపేంద్ర, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, బాలాజీ, తిరుపతిరావు, మల్లేష్, రాంబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల వైఫల్యాలను గడప గడపకూ తీసుకెళ్లాలి

ఖమ్మం సహకారనగర్: 'తిరగబడదాం తరిమికొడదాం' నినాదంతో జిల్లాలోని ప్రతీ గడపకు గత పదేళ్లలో బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను తీసుకెళ్లాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సూచించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నాయకులతో సమావేశమైన ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీ పాలనపై చార్జ్‌షీట్ సిద్ధమైనందున, కరపత్రాలను ఇంటింటికీ చేర్చి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలుచేయనున్న పథకాలను వివరించాలని తెలిపారు. నాయకులు మహ్మద్ జావీద్, పుచ్చకాయల వీరభద్రం, యర్రం బాలగంగాధరతిలక్, మడుపల్లి భాస్కర్‌గౌడ్, తుళ్లూరి బ్రహ్మయ్య, ముజాహిద్ హుస్సేన్, దొబ్బల సౌజన్య, నల్లమల సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిన్న వేడుక... నేడు విషాదం

కూతురి బారసాల మరునటి రోజు కుమారుడు మృతి

వేంసూరు: పాప పుట్టిన ఆనందంలో ఆ కుటుంబం బారసాల వేడుకగా నిర్వహించారు. అంతకుముందు కుమారుడు ఉండడంతో ఇద్దరు పిల్లలతో సంతోషంగా గడపొచ్చని అనుకున్నారు. కానీ ఆటో రూపంలో వచ్చిన మృత్యువు ఆ ఇంట విషాదాన్ని నింపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... ఏపీలోని కృష్ణాజిల్లా తిరువూరు రేళ్లపాడు రాజీవ్ నగర్‌కు చెందిన భరత్‌కుమార్, వేంసూరు మండలం రాయుడుపాలెంకు చెందిన దివ్య వివాహం చేసుకున్నారు. భరత్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, వీరికి రెండేళ్ల కుమారుడు దర్శిత్ ఉన్నాడు. తాజాగా మరో కుమార్తె జన్మించడంతో పాపకు రాయుడుపాలెంలో బుధవారం బారసాల వేడుక నిర్వహించారు. కాగా, గురువారం ఉదయం దర్శిత్ రోడ్డు పక్కన ఆడుకుంటుండగా అజాగ్రత్తగా ఉల్లిపాయల ఆటో నడిపిన డ్రైవర్ ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దర్శిత్‌ను సత్తుపల్లి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో రాయుడుపాలెం ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.



దర్శిత్ (ఫైల్)

మరో బాల్య వివాహం!

- ఒక కేసులో విచారణకు వెళ్లగా వెలుగులోకి...

కామేపల్లి(కారేపల్లి)/ఖమ్మం అర్బన్: కామేపల్లి మండలంలోని ముస్సిబ్ బంజర ఆలయంలో ఇటీవల రెండు బాల్యవివాహాలు జరిగినట్లుగా అధికారులు గుర్తించారు. గ్రామానికి చెందిన బాలిక కుటుంబీకులను ఖమ్మం టేకులపల్లికి చెందిన వివాహితుడైన మధు మాయమాటలతో నమ్మించి ఈనెల 20న స్థానిక భవానీ అమ్మాలయంలో పెళ్లి చేసుకున్నట్లు ఈనెల 23వ తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఐసీడీఎస్ అధికారులు గురువారం ముస్సిబ్ బంజరలో విచారణ చేపట్టారు. ఈసందర్భంగానే మరో బాలిక, యువకుడు 20వ తేదీన ఇదే ఆలయంలో పెళ్లి చేసుకున్నట్లు సమాచారం అందింది. ఈ విషయమై విచారణ చేపట్టగా నిజమేనని తేలడంతో యువకుడి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి బాలికను ఖమ్మం బాలల సదన్‌కు తరలించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఉద్యోగులు లలితకుమారి, సిబ్బంది హరి తెలిపారు. కాగా, మొదటి కేసులో ఐసీడీఎస్ ఉద్యోగి నాగమణి చేసిన ఫిర్యాదుతో మధు, ఆయన తల్లి సుభద్ర, బాలిక తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

వైరారూరల్: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొణిజర్ల మండలం మేకాలకుంటకు చెందిన పఠాన్ దావూద్‌ఖాన్ అలియాస్ అమాన్(27) కొన్ని నెలల క్రితం ఫైనాన్స్‌లో ఆటో కొనుగోలు చేశాడు. అయితే, కిస్తీలు చెల్లించేందుకు ఇబ్బందులు ఎదురుకావడంతో బుధవారం రాత్రి వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో వైరా నది పక్కన మోటార్ షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై ఆయన తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వైరా ఎస్సై మేడా ప్రసాద్ తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

కారేపల్లి: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కారేపల్లికి చెందిన జవ్వాజి రాంబాబు బుగ్గవాగు సమీపాన తనకు ఉన్న ఆరెకరాల్లో వ్యవసాయం చేస్తుండగా, భూమి విషయమై కొంతకాలంగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో గురువారం ఉదయం గ్రామ పెద్దలు పంచాయితీ నిర్వహించారు. అనంతరం మనస్థాపానికి గురైన రాంబాబు తన చేనుకు వెళ్లి స్నేహితుడికి వీడియోకాల్ చేసి పురుగుల మందు తాగుతున్నట్లు చెప్పి కట్ చేశాడు. దీంతో స్నేహితుడు, స్థానికులు గాలించి అపస్మారక స్థితిలో ఉన్న రాంబాబును పీహెచ్‌సీకి తరలించారు. ఆయన పరిస్థితి విషమించడంతో ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

వివాహితపై అత్యాచారయత్నం

చింతకాని: మండలంలోని పాతర్లపాడుకు చెందిన ఓ వ్యక్తి సమీప గ్రామానికి చెందిన వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. సదరు వివాహిత బుధవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయాన్ని గుర్తించిన ఆ వ్యక్తి అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. దీంతో ఆమె కేకలు పరారు కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

పురుగుల మందు తాగిన బాలుడు మృతి

కారేపల్లి: కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగిన ఓ బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని పోలంపల్లికి చెందిన బాలుడు 8వ తరగతి చదువుతున్నాడు. ఆయనకు కడుపునొప్పి రావడంతో భరించలేక మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

మధిర: మండలంలోని నిదానపురం క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి కత్తి యాకోబు(63) మోటార్ సైకిల్‌పై మీనవోలు నుంచి మధిర వైపునకు వస్తున్నాడు. ఈక్రమంలో నిదానపురం క్రాస్ వద్ద సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని మధిర రూరల్ పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఖమ్మంక్రైం: రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి(52) మృతి చెందిన ఘటన ఖమ్మంలో గురువారం చోటుచేసుకుంది. రైల్వేస్టేషన్ సమీపాన పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58589 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కుక్క దాడిలో మహిళకు గాయాలు

కామేపల్లి(కారేపల్లి): మహిళపై కుక్క దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. కామేపల్లి మండలం పరిధిలోని పింజరమడుగుకు చెందిన లక్ష్మిని గురువారం వీధికుక్క కరిచింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను కామేపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లగా వైద్యులు అందుబాటులో లేరు. చేసేదేం లేక కుటుంబ సభ్యులు లక్ష్మిని ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.